# నేహాల



సాయి బ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

## 2

తూర్పు గడియ తీసుకొని సూర్యుడు మెల్లగా ప్రపంచంలోకి అడుగుపెట్టాడు.

పక్షులు మెల్ల మెల్లగా తమ గూట్లోంచి రావడం మొదలెట్టాయి.

గుల్బర్గా నగరం అప్పుడే నిద్ర మేల్కొంటూ వుంది.

ఉదయాన్నే మసీదు ప్రాంగణం కిటకిట లాడుతూ వుంది.

అనేకమంది ముసల్మానులు సలావత్ (నమాజ్) చేయడానికి సిద్ధమవుతున్నారు.

సలావత్ ముగిసింది. అక్కడున్న ముల్లాలందరూ మతప్రవక్త గిసుదరాజ్ ఇస్లాం మత వ్యాఖ్యానాల కోసం ఎదురుచూస్తున్నారు. గిసుదరాజ్ వయస్సు డబ్భయి దాటినా చూడ్డానికి ఏభయ్యేళ్ళ వాడిలానే ఉంటాడు. మంచి శరీరధారుడ్యం ఉంది.

అతని అసలు పేరు సయ్యద్ మహమ్మద్ హుస్సేన్. గుల్బర్గా సుల్తాను అతన్ని "హజ్రత్ ఖాజ్ నవాజ బంద నవాజ్ గిసుదరాజ్" బిరుదుతో సత్కరించాడు. అందరూ ఆయన్ని హజ్రత్ గేసుదరాజ్ అనే సంబోధిస్తారు.

సలావత్ ముగిసాక రోజూ కొద్ది నిమిషాలు గిసుదరాజ్ సూఫీ సిద్ధాంతాల ప్రశస్తి చెప్పడం రివాజు.

కిక్కిరిసిన ప్రాంగణం సూది పడితే వినబడేంత నిశ్శబ్దంగా వుంది.

ఎప్పటిలాగే గిసుదరాజ్ గంభీరమైన కంఠం మరోసారి ప్రతిధ్వనించింది.

"ప్రతీ రోజూ క్రమం తప్పకుండా ఈ ముసల్లీలందరూ ఈ సలావత్ చేయడం ఎంతో ఆనందం కలిగిస్తోంది. సలావత్ అల్లాకి అత్యంత ప్రీతికరమైనది. అల్లాకీ, ముసల్లీకీ (భక్తుడు) మధ్య అనుసంధానమే ఈ సలావత్. దీని ద్వారా అల్లా ముందు నిలబడి కృతజ్ఞతతో ప్రార్థిస్తూ, స్తుతిస్తూ, సరైన జీవన విధానానికీ, నడవడికీ దారి చూపించమని ప్రార్థించడమే ఈ సలావత్ ముఖ్యోద్దేశం. మీరందరూ అల్లా దయవల్ల మంచి నడవడితో సంతోషంగా వుందురుగాక! మన నిత్య జీవన విధానంలో ఎటువంటి తప్పులూ చేయకుండా ఉండేందుకూ, నైతిక విలువలు కాపాడేందుకూ మనముందున్న శక్తివంతమైన ఆయుధమే ఈ సలావత్! మీరందరూ నిష్కల్మషంగా ఇది చేయాలి. ఈ సలావత్ మన కోసం. మన చుట్టూ వున్న సమాజంకోసం. పేరు కోసం ప్రార్థన చేసేవాడు శిక్షార్హుడు. నిర్భయంగా మీరీ ప్రార్థన చేయండి. భయానికో, మెప్పుకో సలావత్ చేయడం అల్లాని మోసం చేయడం వంటిదే! అటువంటి ద్వంద్వప్రవృత్తి మాని మీరందరూ తోటి వారితో దయా, ప్రేమలతో కలిసి జీవించాలని అల్లాని నేను ప్రార్థిస్తున్నాను. మీకెవరికైనా సందేహాలుంటే అడగచ్చు. ప్రశ్నలున్న వారు చెయ్యెత్తండి."

అందరూ ఎంతో శ్రద్ధగా విన్నారు. ఎవరైనా ఎవరైనా అడుగుతారేమోనని చుట్టూ కలియ చూసాడు.

ఎవరూ చెయ్యెత్తలేదు.

"ఈ రోజు ప్రార్థన ముగిసింది. మీరు మీ విధులకు హాజరు కావచ్చు..ఇహ... " అని చెబుతున్న గిసుదరాజ్ ఒక్కసారి ఆగిపోయాడు.

కొంచెం దూరంగా ఒక యువకుడు చెయ్యెత్తి నిలబడ్డాడు. ఏమిటన్నట్లుగా చూసాడు గిసుదరాజ్.

" హజ్రత్ గిసుదరాజ్ మౌలియా! భయానికో, మెప్పుకో సలావత్ చేయడం తప్పని చెప్పారు. అల్లా ఏదో హాని చేస్తాడన్న భయం లేదు. కానీ భయం కలిగేది ఈ సుల్తాను వల్లే! రాయచూరు యుద్ధంలో మన సుల్తానులు విజయం సాధించలేకపోయారు. చిన్న యుద్ధంతో సరిపోయింది. అల్లా దయవల్ల అది పెద్ద యుద్ధంగా మారలేదు. జన నష్టమేమీ కలగలేదు. కానీ ప్రజలందరం భయంతోనే గడిపాము. అలాంటి భయంలో చేసిన సలావత్‌లో శ్రద్ధ లేదు. శ్రద్ధ లేనిది అల్లాను చేరుతుందా? ఈ భయాన్ని పోగొట్టడానికి మార్గాలేమీ లేవా?"

ఆ వ్యక్తి ప్రశ్నని శ్రద్ధగా విన్నాడు గిసుదరాజ్.

నవ్వుతూ జవాబిచ్చాడు.

"ఓ ముసల్లీ, మంచి ప్రశ్న వేసావు. భయంతో చేయడమంటే ఇతరుల వల్ల భయమని కాదు. సలావత్ చేయకపోతే అల్లాయే ఏదైనా చెయచ్చని భయపడడమన్నది. అదీ నేను చెప్పేది."

గిసదరాజ్‌కి తను మాటలు అర్థం కాలేదనుకున్నాడతను. తిరిగి చెప్పాడు.

"మౌలియా! భయం గురించి కాదు నా బాధ. దాని హేతువు గురించి? యుద్ధాల వల్ల అశాంతి తప్పదని మీకు తెలిసికూడా, మీరు సుల్తానుల యుద్ధ కాంక్షని ఆపలేక పోయారా? ఈ అశాంతీ, భయాలూ, యుద్ధాలూ ఇవన్నీ కోరి తెచ్చుకున్నవే కదా? నా విన్నపం ఒక్కటే! తిరిగి ఇటువంటివి రాకుండా కాపాడమని మిమ్మల్ని అర్థిస్తున్నాను." అతను చెప్పడం ముగించి కూర్చున్నాడు.

గిసుదరాజ్‌కి తనే ఉద్దేశ్యంతో చెబుతున్నాడో తెలిసింది. మళ్ళీ అన్నాడు.

"నువ్వు చెప్పిన భయం మనుషులవల్ల కలిగింది. సుల్తానుల వల్ల వచ్చింది. కాబట్టి ఈ భయానికి కారణం సుల్తాన్ ఫిరోజే! యుద్ధాలవల్ల ప్రయోజనం లేదు. అశాంతి తప్ప ఏమీ మిగలదు. నువ్వీ మంచి ప్రశ్న వేసి నాకు కర్తవ్య బోధ చేసావు. ఇప్పుడే సుల్తాన్ ఫిరోజ్ షాకి కబురు పంపిస్తాను. ఈ యుద్ధాలవీ మానమని, ప్రజల క్షేమం చూడమని, మీ అందరి తరపునా కోరుకుంటాను."

చెప్పడం ముగించాక పక్కనే ఉన్న అనుచరుడికి ఆదేశమిచ్చాడు.

"సుల్తాన్ ఫిరోజ్ షాని చూడ్డానికి ఈ మధ్యాన్నం రాజమహల్‌కి వస్తున్నామని కబురు పంపించండి. ప్రయాణానికి కావల్సిన ఏర్పాట్లు చెయ్యండి.." అంటూ ఆదేశాలిచ్చాడు. గిసుదరాజ్ శిష్యులు ఆ పనిలో నిమగ్నమయ్యారు.

ఆ వ్యక్తి వేసిన ప్రశ్న చిన్నదే అయినా గేసు దరాజ్ మనస్సులో తీవ్రంగా నాటుకుంది. గుల్బర్గా ప్రాంతానికి యుద్ధ భయం లేకున్నా దగ్గర్లో ఉన్న రాయచూరుకి ఆభయముంది.. వూళ్ళన్నీ దగ్గర దగ్గరే ఉండడంతో ప్రజల రాకపోకలు ఎక్కువగానే ఉన్నాయి.! రాయచూరు కోసం బహమనీ సుల్తానులూ, విజయనగర రాజుల మధ్య అనేక సార్లు యుద్ధం జరిగింది. వివాదాలు జరిగాయి. రాయచూరు మాదంటే మాదని వాదులాడుకున్నారు. ఇద్దరికీ సయోధ్య కుదర్లేదని తెలుసు. దురదృష్టమేమిటంటే రాయచూరు ఎవరి పాలిత ప్రాంతమూ కాకుండా పోయింది. కృష్ణానది ఉత్తరాన ఉన్న సుల్తానులు దేవసుగుర్ని తమ రాజ్యంలో కలుపుకున్నారు కానీ, రాయచూరుపై పట్టు సాధించలేకపోయారు. దేవసుగుర్ వదులుకున్న విజయనగర రాజులు రాయచూరు వదులుకోడానికి సిద్ధంగా లేరన్నది తనకి తెలుసు. దేవసుగుర్ని విజయనగర రాజులకే వదిలేయమని ఎన్నో సార్లు చెప్పాడు. తన మాటమీద గౌరవముంచి ఫిరోజ్‌షా సరేనన్నాడు. ఈలోగా రాయచూరు ప్రాంతం దాటి దేవసుగుర్ వద్ద విజయనగర రాజులు ముట్టడి చేసారనీ, ప్రజల్ని రక్షించడం కోసం వారిని ఎదుర్కోడానికి వెళుతున్నాడని చెప్పాడంతే! యుద్ధం ముగిసిందని మాత్రం తెలుసు. కానీ వాటి గాయాలు ఇంకా ప్రజల మనసుల్నుండి మాయలేదని ఇప్పుడే తెలుసుకున్నాడు. ఏదైనా శాంతి అవసరం తన మాటగా ఫిరోజ్‌షాకి చెప్పాలి. గిసుదరాజ్ మౌనంగా కూర్చుని ఆలోచిస్తున్నాడు.

అతన్ని చూసి అనుచరుడు మౌల్వీ ఇంతియాజ్ ఆశ్చర్యపోతున్నాడు. సాధారణంగా ఎంతో ఉత్సాహంగా ఉంటూ తన మాటలతో అందర్నీ కట్టిపడేసే గిసుదరాజ్ ఇలా మౌనంగా ఉండడం ఈ మధ్యకాలంలో చూళ్ళేదతను. ఉండబట్టలేక పైకనేసాడు.

"మౌల్వీ! మీరింతగా కలత చెందడమెప్పుడూ చూళ్ళేదు. ఏదో  ముసల్లీ తెలియక అజ్ఞానంతో వేసిన ఓ చిన్న ప్రశ్న మిమ్మల్నింతగా తాకుతుందనకోలేదు?"

"ఇంతియాజ్,  ముసల్లీ చెప్పింది పచ్చి నిజం. బ్రతుకు భయముంటే అల్లాపై దృష్టెలా వెళుతుంది? రోజా సలావత్ చేసినా ఏదో మొక్కుబడిగా ఉంటుంది తప్ప మనస్ఫూర్తిగా చేయడం జరగదు. శాంతి లేని జీవితమూ, స్థిరంలేని మనసూ మనిషిని దహించి వేస్తాయి. ఈ విషయం సుల్తాన్ ఫిరోజ్‌షాకి ప్రత్యేకంగా నా మాటగా చెప్పాలి. ఈ యుద్ధాలు మానమని ప్రమాణం తీసుకోవాలి." గిసుదరాజ్ గొంతులో బాధ కనిపించింది.

సుల్తాను ఫిరోజ్ షా గిసుదరాజ్ మాట దాటడని ఇంతియాజ్‌కి తెలుసు. ఎందుకంటే ఫిరోజ్‌షాని రాజుగా నిలబెట్టింది ఆయనే!

ఇంతియాజ్ మౌనంగానే విన్నాడు. అతనికీ ప్రాంతం కొత్తదే! దౌలతాబాదునుండి గిసుదరాజ్ కోరికపైన వచ్చాడు. గిసుదరాజ్ అంటే ఫిరోజ్ షాకి ఎంతో గౌరవమని తెలుసు. గిసుదరాజ్‌ని ఎదిరించి సుల్తాను నిలవలేడన్న విషయం పది మందీ చెప్పగా విన్నాడు.

"మౌల్వీ! మీ మాటంటే సుల్తానుకి అల్లా మాటతో సమానం. మీరు అంతగా విచారపడనవసరం లేదు."

"విచారం కాదు. బాధ! నీకు తెలీదు. నలభై ఏళ్ళుగా ఢిల్లీలో బ్రతికిన నేను కేవలం శాంతి స్థాపనకై ఇక్కడుండిపోయాను. సూఫీ మతప్రచారకుడిగా నేను ఢిల్లీలోనే గడపచ్చు. ఇన్నాళ్ళుగా ఇక్కడెందుకు వున్నాననుకున్నావు? ఇంతకుముందున్న సుల్తాన్ మహమ్మద్ షా పిలుపు మేరకై వచ్చిన నేను ఈ ప్రాంత ప్రజలకి సుఖశాంతులు కరువయ్యాయనీ, వారందరి మంచికోసం ఇక్కడే ఉండిపోయాను. దురదృష్టవశాత్తూ మహమ్మద్ షా చనిపోయాడు. అతని తరువాత సరైన రాజులేక ప్రజలు అశాంతికి గురవుతారనీ పరిస్థితులు చక్కబడే వరకూ ఇక్కడే ఉండాలని నిశ్చయించుకొని ఇన్నాళ్ళూ ఉండిపోయాను. గత నాలుగేళ్ళగా పరిస్థితులు కుదుట పడ్డాయనుకుంటే మరలా ఈ రాయచూరు యుద్ధమొచ్చింది. ఎవరు ఎవర్ని వుసిగొలిపారో తెలీదు. తెల్సుకునేంత సమయం నాకు లభించలేదు. అప్పటికే ఫిరోజ్ యుద్ధానికి వెళ్ళడమూ, తిరిగి రావడమూ జరిగిపోయాయి. మరలా ఇటువంటివి జరక్కుండా చూడాలన్నదే నా తపన.."

"మీ ఆశయం మా అందరికీ తెలుసు. సూఫీ మత ప్రవక్తగా మీ పేరు ఢిల్లీ నుండి ఇక్కడ వరకూ పాకడానికి కారణం మీ శాంతి విధానామే! మీ దగ్గర ఏంతో కొంత నేర్చుకుందామనే మీ పేరువిని నేనూ ఇక్కడకొచ్చాను మౌల్వీ! మహమ్మద్ షా పాలన గురించి నేనూ విన్నాను. ఎంతో ఆనందంగా ప్రజలు గడిపారని ఇప్పటికీ చెబుతూ ఉంటారు.   ఈ సంగతి చెప్పండి. మహమ్మద్ షాని విషమిచ్చి చంపేసారని విన్నాను. నిజమేనా?"

"లేదు. నువ్విన్నది నిజం కాదు. మహమ్మద్ షా సుమారు పద్దెనిమిదేళ్ళు పాలించాడు. అతను కార్యదీక్ష గలిగిన సుల్తాను. ప్రజలందరనీ ఎంతో ప్రేమగా చూసుకునేవాడు. పాలించినన్నేళ్ళూ ఒక్క యుద్ధంకానీ, గొడవలు కానీ లేవు. ఈ మహమ్మద్ షాకి పిల్లలు లేకపోతే తమ్ముడి పిల్లలయిన ఫిరోజ్, అహ్మదులని పెంచుకున్నాడు. వాళ్ళిద్దర్నీ సొంత కొడుకులుగానే చూసుకున్నాడు. కొంతకాలమయ్యాక మహమ్మద్ షా మూడో భార్యకి కొడుకుపుట్టాడు. అతనికి ఎనిమిదేళ్ళ వయసులో మహమ్మద్ షాకి తీవ్ర విష జ్వరమొచ్చింది. చావు బ్రతుకుల మధ్య కొట్టాడుతూ తన తదనంతరం తన కొడుకునే సుల్తాన్ చెయ్యాలనీ, ఈ రాజ్య  సంరక్షకులుగా ఫిరోజ్‌నీ, అహ్మదునీ నియమిస్తూ శాసనం చేసి, కొంతకాలానికి చనిపోయాడు. ఇక్కడికి నేనొచ్చి అప్పటికి పదేళ్ళవుతోంది. రాజ్యాన్ని కాపాడతానని మహమ్మద్ షాకి మాటిచ్చాను. కానీ కొన్ని అనుకోని సంఘటనల వల్ల మహమ్మద్ షా కొడుకు తన్మతన్ షా అధికారం కోల్పోవలసి వచ్చింది.  తరువాత కొంత అస్థిరత ఫిరోజ్ షా రాజయ్యాడు..."

ఇంతియాజ్ మౌనంగా వింటున్నాడు.

"మరి తన్మతన్ షా ఏమయ్యాడు. చంపేసారా అతన్ని?"

లేదన్నట్లుగా తలూపాడు గిసుదరాజ్. ఇంతలో అటువైపుగా ఎవరో వస్తున్న అలికిడి కావడంతో బయటకొచ్చి గుమ్మం వైపుగా చూసారు. సుల్తానుకి కబురుకోసం పంపినతను వచ్చాడు.

"మౌల్వీ గిసుదరాజ్, ఫిరోజ్ షా సుల్తానుల వారే మిమ్మల్ని కలవడానికి వస్తామని చెప్పమన్నారు. మీరు శ్రమ తీసుకొని కోటకి రానవసరం లేదని చెప్పారు. ఈ మధ్యాహ్నం వారే స్వయంగా వస్తామని చెప్పమన్నారు."

సరే నన్నట్లుగా చూసాడు గిసుదరాజ్. మసీదు వ్యవహారాలు చక్కబెట్టడానికి ఇంతియాజ్ శలవు తీసుకున్నాడు. గిసుదరాజ్ మసీదు ప్రాంగణంలోనే ఉన్న తన మందిరం వైపుగా వెళ్ళాడు.

0000000000000

ఉదయాన్నే వేదరాయశర్మ విజయనగర రాజమందిరానికి వెళ్ళాడు. తన తోడుగా రమ్మనమని అడిగితే, వంట్లో నలతగా ఉందని రాలేనని చెప్పాడు రేవన్న. వెళ్ళకపోవడానికి కారణం వేరే వుంది. రాత్రంతా అతనికి నేహల ఊసే తప్ప మరోటి లేదు. ఆలోచనలు చాలా సేపటి వరకూ నిద్ర పట్టనివ్వలేదు.

నేహల కూడా ఈ విజయదశమి ఉత్సవాలకి వచ్చి ఉంటే ఎంత బావుండేదో కదా? రమ్మనమని తను ఎంతో బ్రతిమాలాడు. గురువుగారు చెప్పినా రానంది. నేహల రానందుకు తనూ తన మిత్రులూ వేరే నృత్యరూపకం చెయ్యాల్సి వచ్చింది. నేహలే వచ్చుంటే జయదేవ అష్టపదులకి నాట్యం చేసుండేవారు. తను పదిమంది ముందూ నాట్యం చెయ్యడం తనకిష్టంలేదని గురువుగారికి చెప్పడంతో ఆయనా వచ్చి తీరాలంటూ బలవంతం పెట్టలేదు. అక్కడికీ తను ఒకటికి పదిసార్లు అడిగాడు నేహల్ని. కోపగించుకుంది తప్ప ఫలితం లేకపోయింది. నేహల వచ్చుంటే ఈ విజయనగర వీధులన్నీ ఇద్దరూ కలిసి తిరిగే వారుకదా? విరూపాక్ష దేవాలయం చూస్తే ఎంత సంతోషించేదో కదా?

ఆ గుడి దగ్గర కళ్ళు చెదిరే అంగళ్ళున్నాయి. ఎన్ని రకాల వస్తువులమ్ముతున్నారో కదా? నేహలకేదయినా కొనిస్తే? తన దగ్గర అంతగా ధనం లేదు. గురువుగారితో రాజమందిరానికెళ్ళినప్పుడు అయిదు కాసులు బహుమతిగా ఇచ్చారంతే! తనకి ఇదంతా అవసరం లేదు. గురువుగారే అంతా చూసుకుంటారు.

వేదరాయ శర్మ అటు రాజమందిరానికెళ్ళగానే, రేవన్న ఒక్క ఉదుటున లేచి కూర్చున్నాడు. ఉదయం నుండీ నటిస్తున్న అనారోగ్యం కాస్తా క్షణంలో పోయింది. తోటి సహచరులూ ఇది చూసి మొహం చిట్లించుకున్నారు. రేవన్న వాళ్ళందర్నీ విరూపాక్ష దేవాలయం చూడ్డానికి వెళదామని ప్రేరేపించాడు. అందరూ సరే నన్నారు.

రేవన్నకి విరూపాక్షుణ్ణి చూడ్డంకంటే అక్కడ గుడి ముందున్న అంగళ్ళ వద్దే పనుంది. నేహలకి అక్కడ ఒక బహుమతి కొని పట్టుకెళ్ళాలి. పైకి అనలేదు. ఎవరికీ చెప్పలేదు. ఏం కొనాలో తెలీదు. ఒక అంగడిలో అందమైన రంగులతో చేసిన లక్క కంకణాలు చూసాడు. మరో చోట వెండి పట్టీలు అమ్ముతున్నారు.

తన వద్ద అంత పైకం లేదు. లక్క కంకణాలు రేవన్నకీ నచ్చాయి. అవే కొందామని నిశ్చయించుకున్నాడు. తీరా కొందామనుకునే సరికి కంకణాలు నేహలకి నచ్చుతాయో లేదోననిపించింది. నచ్చినా ఆమె చేతికివి సరిపోతాయా? మరీ పెద్దవిగా ఉన్నాయేమో?

పరధ్యానంగా ఆలోచిస్తూండగా అతని దృష్టి పక్కనే ఉన్న అంగడి మీద పడింది. అక్కడొకతను అందమైన ఎర్రటి వస్త్రంపై ఏదో రాస్తూ కనిపించాడు.

మొదట చిత్రలేఖనం అనుకున్నాడు. ఉత్సాహంగా దగ్గరకెళ్ళి చూసాడు.

అతను ఎర్రటి వస్త్రంపై పసుపు రంగు అక్షరాలతో సంస్కృత శ్లోకం రాస్తున్నాడు.

రేవన్న ఇంతకు మునుపు తాళపత్రాలపై రాయడం చూసాడు. శిలాఫలకాలపై అక్షరాలు చెక్కడం చూసాడు. కానీ వస్త్రంపై రాయడం చూడ్డం ఇదే ప్రథమం. రాజులు విజ్ఞాపనలు రాయించేది వస్త్ర పత్రాలపైనే అని విన్నాడంతే! ఎప్పుడూ చూళ్ళేదు. దగ్గరకెళ్ళి పరికించి చూడ్డం మొదలు పెట్టాడు. ఆ అంగళ్ళో ఉన్నతను ఏం కావాలని అడిగాడు.

"ఏమిటిది? ఇవి అమ్ముతారా?"

అవునన్నట్లు తలూపాడా వ్యక్తి.

"ఏదైనా రాస్తారా? ఎంత చెల్లించాలి?"

"రెండు కాసులవుతుంది. ఏదైనా చెప్పు రాసిస్తాను. ఈ భజగోవింద శ్లోకం రాయమని ఒకళ్ళు చెప్పి, దేవుడి దర్శనానికి వెళ్ళారు. వాళ్ళొచ్చేలోగా ఇది తయారు చేస్తున్నాను." అని చెబుతూ రేవన్న కేసి వింతగా చూసాడు.

రెండు కాసులేనా? అనిపించింది. అది చూడగానే రేవన్నకి ఒక ఆలోచన తట్టింది.

ఆ వస్త్రంపై నేహల పేరు రాసిమ్మని అడిగితే? అమ్మో గురువుగారు చూస్తే చంపేస్తారు. తన సహచరులు చూసినా ప్రమాదమే?

పోనీ తనూ ఓ శ్లోకం రాయమంటే? చ! శ్లోకం ఏమిటి? అయినా నేహలకి సంస్కృతం అంతగా రాదు.

పోనీ ఏదయినా బొమ్మ వేయమంటే? రేవన్నకి ఏమీ తోచడం లేదు.

ఆలోచిస్తూ బయటకి చూసాడు. ఎదురుగా వున్న ఒక అంగడిలో రాధాకృష్ణుల విగ్రహం కనిపించింది. అది చూడగానే తళుక్కున ఓ ఆలోచనొచ్చింది.

నేహలకి జయదేవ అష్టపదులంటే ఇష్టం. ఓ అష్టపది వస్త్రం పై రాయమని అడిగితే?

అష్టపదంటే ఎవరికీ అనుమానం రాదు. గురువుగారూ ఏమీ అనరు. ఈ ఆలోచన బానే ఉంది. కానీ తన హృదయాన్ని నేహలకెలా తెలిపేది?

అష్టపది సంస్కృత రచన. అర్థం చెప్పమని తననెప్పుడూ వేధించుకు తినేది. అర్థం చెప్పడం కంటే తనే తెలుగులో అష్టపదిని భావం చెడకుండా రాసిస్తే! ఈ ఆలోచన బానే ఉంది. కానీ తెలుగులో ఇప్పటికప్పుడు రాయాలంటే కష్టమే! కాస్త సమయం పడుతుంది.

నేహలకి "సావిరహే తవ దీనా!" అష్టపదంటే ఇష్టం. అది తెలుగులో రాయాలంటే భావానికి తగ్గ పదాలు వాడాలి. ఆలోచిస్తూ అతను తనలో తనే పల్లవీ, ఒక చరణం వల్లె వేసుకుంటున్నాడు. ఈలోగా స్నేహితులు తుంగభద్రా నదిలో స్నానానికి రమ్మనమని అడిగారు. తను రానని చెప్పి పంపించేసాడు.

అక్కడే కూర్చుని నేహలకి నచ్చిన అష్టపదిని తన ఇష్టపదిగా మార్చాడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఆలోచించగా, ఆలోచించగా పల్లవి కుదిరింది. వరసగా చరణాలూ అప్రయత్నంగా వచ్చేసాయి.

"నేనొక పాట చెబుతాను. రాసిస్తావా?" రేవన్న అడిగాడు.

"ఏ పాట? శివుడి మీదా?" అతను తలెత్తకుండా పని జేసుకుంటూనే అడిగాడు.

"కాదు. కృష్ణుడి మీద పాట."

"ఎవరు రాసారు? నువ్వు రాసావా?" వేళాకోళం చేస్తూ అంగడి వ్యక్తడిగాడు.

"నేను రాయలేదు. జయదేవుడు రాసాడు. అష్టపది."

"ఓ అలానా! అయితే అక్కడున్న చిప్పలో సుద్ద ముక్కలు తీసుకో! పక్కనే ఉన్న పలక మీద రాసియ్యి. తప్పుల్లేకుండా రాయి. నువ్వెలా రాసితే అలాగే నేనూ చేస్తాను." అని చెప్పి తన పనిలో నిమగ్నమయి పోయాడు.

రేవన్న సుద్దముక్క తీసుకొని పలకమీద రాయడం మొదలు పెట్టాడు. రాసాకా అతని చేతికిచ్చాడు. అది చదివి అతను కనుబొమ్మలు ముడేసి రేవన్నకేసి అదోలా చూసాడు.

"జయదేవ అష్టపదన్నావు? ఈ తెలుగేవిటి? అది సంస్కృతం కదా?" అనుమానమొచ్చింది అతనికి.

"అష్టపది మూలం సంస్కృతమే..నేనే భావాన్ని తెలుగులో కూర్చి రాసాను.." ఆ వ్యక్తి నవ్వాడు.

"ఏ అష్టపదికి తెలుగు రూపం ఇది?" గట్టిగా నవ్వుతూ అడిగాడావ్యక్తి.

రేవన్నకి సిగ్గేసింది తన రాసింది చూసి. తలదించుకున్నాడు.

రేవన్న మొహంలో రంగులు మారడం గమనించాడావ్యక్తి.

"లేదు. నువ్వు రాసింది బావుంది. ఏ అష్టపదాని అడిగానంతే! నాకూ అవంటే చాల ఇష్టం."

రేవన్న కాస్త కుదుటపడ్డాడు.

"నిందతి చందన ఇందు కిరణ ... అదే - సావిరహే తవ దీనా?"

ఆ పలక మీద రేవన్న రాసింది అతను పైకి చదువుతున్నాడు.

చదువుతూన్నంత సేపూ అతని కళ్ళముందు నేహాలే మెదిలింది.

*అలరుల గంధము శీతల వెన్నెల కలతల చెంత మదీయం*
*మలయ పవనము హాలమై తోచగా లాలన చెందెను ఖేదనం*
*మాధవ తలపున పూవులు తాకెడి భావనలే మది లోనా*
*నా విరహం కన లేవా?*

"బాగా రాసావే! నాకూ కాస్త సంస్కృతం వచ్చులే!"

అతను పాట పల్లవీ రెండు చరణాలూ రాసిచ్చాడు. మొత్తం చరణాలన్నీ రాయడానికి చోటు చాలదని చెప్పాడు. రాయడం పూర్తయ్యాక అతను ఎండలో కాసేపుంచాడు. ఆరితే రంగు త్వరగా అంటుకుంటుందని అన్నాడు.

"నీకు పెళ్ళయ్యిందా?" రేవన్ననడిగాడా వ్యక్తి.

"లేదు" తల అడ్డంగా ఆడించాడు.

"ఎవరికోసం ఈ ప్రేమ పత్రం? ప్రియురాలికోసమా?"

రేవన్న సమాధానమివ్వలేదు. ప్రియురాలనగానే అతని కళ్ళు మెరిసాయి. మొహంపై అప్రయత్నంగా చిరునవ్వు మెరిసింది.

అవునన్నట్లుగా తలూపాడు.

"బావుంది. నీ ప్రేమ స్వచ్ఛంగా ఉంది కాబట్టే క్షణంలో పాట కట్టగలిగావు. నువ్వు రాసింది కూడా నాకు నచ్చింది. ముఖ్యంగా నీ భావుకత. ప్రియురాలికి అలంకరణ వస్తువులూ, బంగారం ఇలాంటి కానుకలే ఇవ్వడం చూసాను కానీ ఇలా కవిత్వం చెప్పడం మొదటి సారి చూస్తున్నాను." అతను రేవన్నని అభినందించాడు.

రేవన్న పైకం చెల్లించి పత్రం తీసుకుని వెనుతిరిగాడు. రెండడుగులు వేయగానే ఆ వ్యక్తి పరిగెత్తుకుంటూ వెనకాలే వచ్చాడు. రేవన్న ఏమిటన్నట్లు చూసాడు.

అతను ఆయాసంతో రొప్పుతూ చేతిలోంచి ఒకటి తీసి రేవన్న చేతిలో పెట్టాడు. ఏమిటిదన్నట్లు చూసాడు రేవన్న.

"ఇది నీ ప్రేమకి నేనిచ్చే కానుక. తీసుకో"

రేవన్న వస్తువు విప్పి చూసాడు. పద్మాకారంలో ఉన్న బంగారు తాయత్తది. వద్దన్నట్లుగా అతని చేతిలో పెట్టబోయాడు.

అతను వద్దంటూ ఆ తాయత్తుని రేవన్న చేతిలో పెట్టాడతను.

"తీసుకో. ఇది నీ ప్రేమనీ, కవిత్వాన్నీ మెచ్చి నేనిచ్చిన కానుకనుకో! వచ్చేసారి ఈ విరూపాక్షాలయానికి మీరిద్దరూ కలిసి రావాలి."

రేవన్న మొహమాటపడ్డాడు. ఏం చెప్పాలో తెలీలేదు రేవన్నకి. రేవన్న మొహంలో ఆశ్చర్యం, సంతోషం ఒకేసారి కలిగాయి. మాటలు పెగల్లేదు.

"ఈ విరూపాక్షుని గుర్తుగా నీ ప్రియురాలికియ్యి." అని చెప్పి వెనుదిరిగాడతను.

వెళిపోతూ అతనే మళ్ళీ అడిగాడు.

"ఇంతకీ నీ ప్రియురాలి పేరు?"

నవ్వుతూ, చెయ్యూపుతూ చెప్పాడు రేవన్న.

"నేహల!"

0000000000000000000000000000

మధ్యాహ్నం గిసుదరాజ్‌ని కలవడానికి అంతరంగికులతో కలిసి మసీదుకొచ్చాడు తాజుద్దీన్ ఫిరోజ్ షా.

అతనితో కూడా తమ్ముడు అహ్మద్ ఖాన్ కూడా వచ్చాడు. అహ్మద్ ఖాన్ అన్నగారు సుల్తానయితే తమ్ముడు వకీల్-ఏ-సుల్తాన్ (ప్రధాన మంత్రి).

గిసుదరాజ్ పిలిచాడంటే అతనికి అనుమానమొచ్చింది. పరిపాలనలో గిసుదరాజ్ వేలెట్టకపోయినా తప్పులు జరిగితే ఊరుకోడనీ, మందలించడానికి వెనుకాడడనీ తెలుసు. యుద్ధానికి వెళ్ళడానికి ఫిరోజ్‌షా గిసుదరాజ్ అనుమతికోసం వెళ్ళబోతే తనే ఆపించాడు. విజయనగర రాజులే ఈ యుద్ధాన్ని ఉసిగొలిపినట్లుగా అన్నగారి చేత చెప్పించాడు. యుద్ధం గురించి గిసుదరాజ్‌కి తెలిసే ఉంటుంది. అందుకే ఫిరోజ్‌షాని కలవడానికి వస్తానన్నాడు. గిసుదరాజ్ రావడంకంటే తామే వెళ్ళి విషయాలు చెప్పడం మంచిదని అహ్మద్ ఖాన్‌కి తెలుసు. అందుకే ఆనాటి సైనిక చర్చలు వాయిదా వేసి అన్నగారిని ఉన్న పళాన ప్రయాణం కట్టించాడు.

అన్నగారికి గిసుదరాజ్ అంటే అమితమైన భక్తి. ఆయన దయా భిక్ష వల్లే అన్నగారు సుల్తానయ్యాడన్న విషయం అతను మర్చిపోడు. సుల్తానుకంటే గిసుదరాజ్ మాటకే ప్రజలు విలువిస్తారన్నది అతని అనుభవం. కాబట్టి గిసుదరాజ్ నొప్పించేలా అహ్మద్ ఖాన్ ప్రవర్తించడు.

అన్నగారికేం మాట్లాడాలో, ఏం మాట్లాడకూడదో పదే పదే చెప్పాడు. అతని జాగ్రత్తలతనివి. అతని ఆశలతనివి. అతని రాజకీయాలతనివి.

ఫిరోజ్‌షా వస్తూనే గిసుదరాజ్ ముందు మోకరిల్లాడు. ఎంతో వినయంతో పలకరించాడు.

"సుల్తాన్ తాజుద్దీన్ ఫిరోజ్‌షా! మమ్మల్ని చూడ్డానికి ప్రత్యేకంగా రావడం చాలా సంతోషం. అల్లా నిన్నూ, ఈ బహమనీ ప్రజల్నీ కాపాడుగాక." గిసుదరాజ్ ఆలింగనం చేసుకున్నాడు సుల్తాన్ని.

"పరిపాలనా భారంవల్ల నేనే మిమ్మల్ని కలవలేకపోయాను. ఈలోగా విజయనగర రాజులతో యుద్ధం వచ్చి పడింది. గొడవల్లో పడి మీతో కాలం గడపలేకపోయాను."

"సుల్తాన్ ఫిరోజ్! నీ విధులూ, పరిపాలనా భారం అర్థం చేసుకోగలను. యుద్ధానికి వెళ్ళేముందు అతి తక్కువ సమయమే కలిసామనీ, నిన్ను చూడాలనిపించీ వస్తానని కబురంపాను. నా మీద గౌరవంతో నువ్వే రావడం సంతోషం."

"మిమ్మల్ని కలవడం ఎప్పుడూ ఆనందమే! విజయనగర రాజు దేవరాయల సైన్యం ఆగడాలెక్కువయ్యాయి. రాయచూరుని ఎలాగైనా ఆక్రమించాలనీ మనల్ని రెచ్చగొడుతున్నారు. ప్రజల రక్షణే నాకు ముఖ్యం. అందుకే గత్యంతరం లేకపోయింది. యుద్ధం తప్పలేదు. ప్రజల మేలు కోరి నేనే శాంతి సందేశం పంపి యుద్ధం ఆపించాను. అంతగా ప్రాణ నష్టం కలగలేదు."

యుద్ధ వివరాలన్నీ చెప్పాడు ఫిరోజ్‌షా. పక్కనే అహ్మద్ ఖాన్ అంతా శ్రద్ధగా గమనిస్తున్నాడు. అన్నగారు ఎక్కడ నోరు జారుతాడోనన్న భయం అతనిది. అలాంటిదేమీ జరగలేదు. కొంతసేపు ముచ్చటించుకున్నాక రాజమహల్‌కి తిరిగి వెళ్ళడానికి సిద్ధమయ్యాడు ఫిరోజ్‌షా.

గిసుదరాజ్ వివరాలు తెలుసుకున్నాడే తప్ప ఫిరోజ్ షాకి ఏ రకమైన సలహాలూ, ఆదేశాలూ ఇవ్వలేదు.

కానీ బయల్దేరుతుండగా ఓ మాటన్నాడు.

"సుల్తాన్! నేను ఢిల్లీ వెళ్ళకుండా ఇక్కడే ఎందుకున్నానో నీకు తెలుసు. నీ కోరిక మీదనే ఇక్కడున్నాను. మహమ్మద్ షా మరణానికి ముందే గుల్బర్గా వదిలి వెనక్కి వెళిపోదామనుకున్నాను. కానీ ఇక్కడ రాజకీయ అనిశ్చితి చూసి ప్రజల శాంతికోసం ఇక్కడుండి పోయాను. నా మీద గౌరవముంచి నువ్వు యుద్ధాలు చేయద్దు. దేవసుగుర్ దాటి రాయచూరు వెళ్ళద్దు. పోనీ ఆ వూర్ని వాళ్ళకే వదిలెయ్యి. రాజ్యకాంక్ష అతి ప్రమాదకరమైంది. చివరికి అది మరణానికే దారి తీస్తుంది. ఈ ఒక్క విషయం గ్రహించు."

గేసుదరాజ్ మాటలకి అలాగే నన్నట్లుగా తలాడించాడు తప్ప ఎదురు చెప్పలేదు. మరలా గేసుదరాజే అన్నాడు.

"నీ వంతటనీవు యుద్ధాలు చేయనని అల్లా సాక్షిగా నాకు మాటివ్వు."

ఇది విని ఫిరోజ్‌షాకి ఏం చెప్పాలో తెలీలేదు. అన్నగారు ఏం తొందరపడతాడాని అహ్మద్ ఖాన్ బిక్కుబిక్కుమంటూ చూస్తున్నాడు.

"మౌలియా గిసుదరాజ్! నా అంతట నేనుగా మొదలెట్టిన యుద్ధం కాద్దిది. మీరు కోరినట్లుగా ప్రజల క్షేమమే నాకు ముఖ్యం. కానీ పొరుగు రాజు దండెత్తితే మన ప్రజల్ని కాపాడవలసిన బాధ్యత కూడా నాకుంది. కాదంటారా? అల్లా సాక్షిగా చెబుతున్నాను. నాకు బహమనీ ప్రజల శాంతి ముఖ్యం. దానికోసం నా ప్రాణాలయినా ఇస్తాను." ఫిరోజ్‌షా ఆవేశంగా అన్నాడు.

ఇదివిని గిసుదరాజ్ ఏమీ అనలేకపోయాడు. ఫిరోజ్‌షా చెప్పిందీ సబబుగానే అనిపించింది. ప్రజల్ని కాపాడవలసిన బాధ్యత సుల్తానుదే కదా? సరే నన్నట్లుగా ఫిరోజ్‌షా చేతులు పట్టుకున్నాడు. అన్నగారి సమాధానం విని అహ్మద్ ఖాన్ ఆశ్చర్యపోయాడు. ఇంత తెలివిగా చెబుతాడని ఊహించలేదు. ఎక్కడ అన్నగారు మాటిచ్చేస్తాడాని హడలిపోయాడు. అలాంటిదేమీ జరగలేదు. హమ్మయ్యా అనుకుంటూ ఊపిరి పీల్చుకున్నాడు.

"నువ్వు చెప్పిందీ కాదనను. నీ మీద నాకు విశ్వాసముంది. అడగడం మరిచాను. తన్మతన్ షా ఎలా వున్నాడు? వైద్యం ఏమయినా ఫలించిందా?"

"రెండేళ్ళుగా ఎలాంటి మార్పూ లేదు. అల్లా దయుంటే తప్ప తిరిగి కళ్ళొచ్చే ఆస్కారం లేదు. రాజ మహల్ విడిచి బయటకి రావడానికిష్టపడడం లేదు. మీరు కుశలమడిగినట్లుగా చెబుతాను."

శలవు తీసుకొని ఫిరోజ్‌షా అక్కడనుండి బయల్దేరాడు.

ఫిరోజ్‌షా రావడం, గేసుదరాజ్‌తో సంభాషణలూ అన్నీ చెవులిక్కించి ఎంతో జాగ్రత్తగా విన్నాడు ఇంతియాజ్. రాజులూ, రాజకీయాలు అతనికి తెలీవు. ఆ నోటా ఈనోటా వినడమే తప్ప ఎప్పుడూ చూళ్ళేదు. మొదటి సారి ప్రత్యక్షంగా చూసాడు సుల్తాన్ని. రాత్రి గిసుదరాజ్‌తో ఉండగా ఒక ప్రశ్నడిగాడు. అది తన్మతన్ షా గురించి.

"గిసూదరాజ్, తన్మతన్ షా చచ్చిపోయాడని అందరూ అంటారు. మీరు కాదని చెప్పారు. సుల్తాన్‌తో మాట్లాడుతుండగా అతను గుడ్డి వాడని తెలిసింది. ఏమయ్యింది, అతని కళ్ళేలా పోయాయి?"

గిసుదరాజ్ చెప్పడం మొదలు పెట్టాడు.

"మహమ్మద్ షా పోయాక పెద్ద కొడుకు తన్మతన్ షా సుల్తానయ్యాడు. వయసులో చిన్నవాడవ్వడంతో ఫిరోజ్ షా, అతని తమ్ముడూ పాలన చూసుకునే వాళ్ళు. తన్మతన్ షా సుల్తానయ్యాడు కానీ అతని తల్లి మాత్రం రాణి కాలేక పోయింది. మహమ్మద్ షా మొదటి భార్యే రాజమాతగా చెలామణీ అవుతూ వచ్చింది. ఇది తల్లి యాస్మిన్‌కి నచ్చలేదు. తన్మతన్‌షా తల్లి బంధువొకాయనకి వకీల్-ఎ-సుల్తాన్ పదవిపై కన్ను పడింది. అతని పేరు తగల్చిన్. అతను యాస్మిన్‌తో చేతులు కలిపి ఫిరోజ్‌షానీ, అహ్మద్‌ఖాన్నీ చంపిద్దామని పన్నాగం పన్నాడు. ఓ రాత్రి విందులో తన్మతన్‌షాపై దాడి చేసి అతని కళ్ళు పొడిచేసారు. ఫిరోజ్ షా, తమ్ముడూ తప్పించుకొని నా దగ్గరకొచ్చారు. ఈలోగా రాజమహల్లో అందరూ తిరగబడడంతో తగల్చిన్ గత్యంతరం లేక తన్మతన్‌షా సవతి తమ్ముడు సంషుద్దీన్ దౌడ్‌ని సుల్తాన్ చేసాడు. యాస్మిన్ రాజమాతయ్యింది. నావద్ద ఫిరోజ్, అహ్మద్ తలదాచుకున్నారని తెలిసింది. వాళ్ళని చంపాలని పథకమేసాడు తగల్చిన్. ఈ విషయం తెలిసి తన్మతన్‌షా కొంతమంది సహాయంతో తప్పించుకొని నా దగ్గరకొచ్చాడు. అప్పుడు నేను వాళ్ళ ముగ్గుర్నీ ఇక్కడ నుండి సాగర్ పంపించేసాను. ఓ ఆర్నెల్ల తరువాత గుల్బర్గా ప్రజల సహకారంతో ఫిరోజ్‌షా తగల్చిన్ని ఎదుర్కొన్నాడు. ఆ సందర్భంలో యాస్మిన్, తగల్చిన్, సంషుద్దీన్ మరణించారు. తన్మతన్‌షాని సుల్తాన్‌గా నియమిద్దామనుకుంటే, నేనే వద్దని వారించి ఫిరోజ్‌షాని గద్దెనెక్కిమని చెప్పాను. తన్మతన్‌షా గుడ్డివాడయ్యాడు. ప్రజల్ని పాలించడానికి కావల్సింది వంశపారంపర్య హక్కు కాదు. పరిపాలనా సామర్థ్యం కావాలి. అవన్నీ ఫిరోజ్‌షాకున్నాయి. అతని తమ్ముణ్ణి వకీల్ చేసి ఈ బహమనీ రాజ్యానికి శాంతి సౌఖ్యాలందించేలా చూడమని చెప్పాను. తనపై జరిగిన హత్యా ప్రయత్నం చూసాక తన్మతన్‌షా మానసికంగా క్రుంగిపోయాడు. బయట ప్రపంచానికి దూరంగా బ్రతుకుతున్నాడు. అతను బ్రతికున్నట్లుగా కూడా చాలా మందికి తెలీదు. అది తెలిస్తే సుల్తాన్ చెయ్యడానికి మరొకరు ప్రేరేపిస్తారు. మళ్ళా వెన్నుపోటులూ, పథకాలూ, యుద్ధాలూ తప్పవు. ఇవన్నీ నివారించడానికే తన్మతన్‌షా బ్రతికున్నట్లుగా ఎవరికీ చెప్పలేదు. నువ్వు కూడా ఎవరికీ చెప్పద్దు. ఒక మనిషి ప్రాణం కంటే కొన్ని వేలమంది సుఖశాంతులే ఈ బహమనీ రాజ్యానికి అవసరం. అందుకే నేను ఇక్కడే ఉండిపోయాను..."

గిసుదరాజ్ చెప్పినదంతా విని ఆశ్చర్యపోయాడు. ఫిరోజ్‌షా సుల్తానెలా అయ్యాడో తెలిసింది. సుల్తాన్ని ఇవాళే మొదటసారి చూసాడు. అతని మాటల్లో కొంతైనా నిజాయితీ కనిపించినా, అహ్మద్‌ఖాన్ చర్యలూ, ముఖకవళికలూ అతనికి నచ్చలేదు. ఎందుకో అతని మీద అనుమానం కలిగింది. అతను చాలా కఠినుడనీ అందరూ చెప్పగా విన్నాడు. అతన్ని చూసేక అది నిజమనిపించింది.

"గిసుదరాజ్! మీకో విషయం తెలుసా? విజయనగర రాజులు మనపై దండెత్త లేదు. అహ్మద్‌ఖానే వాళ్ళపై యుద్ధానికెళ్ళాడని ప్రజలనుకుంటున్నారు. ఇతనే కయ్యానికి కాలుదువ్వాడనీ, రాయచూరు ప్రజలపై దాడి చేసాడని అంటున్నారు. కానీ సుల్తాన్ చెప్పింది వేరేగా ఉంది..."

"నాకూ తెలిసింది. సుల్తాన్ అబద్ధం చెబుతున్నాడని గ్రహించాను..." గిసుదరాజ్ మెల్లగా చెప్పాడు.

గిసుదరాజ్ చెప్పింది విని ఇంతియాజ్ విస్తుబోయాడు.

"మరి మీకు తెలుసుండీ ఎందుకు ప్రశ్నించలేదు...?"

ఒక్క సారి ఇంతియాజ్ మొహంలోకి చూసాడు గిసుదరాజ్.

"అడగడానికీ ఒక సమయముంది..." మెల్లగా అన్నాడు.

(కొనసాగింపు వచ్చేసంచికలో)

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంధాలయాన్ని సందర్శించండి..




Click here to go to KOUMUDI Library